# పొగ

సాయంత్రం నాలుగు గంటలు అయింది. శీతాకాలం ఎండలోని వెచ్చదనం తగ్గిపోతోంది. అప్పటిదాకా టీ.వీ చూస్తూ కూర్చున్న శారద బద్ధకంగా లేచింది. కాఫీ తాగింది. భర్త ఊరికి వెళ్ళాడు. మర్నాడు వస్తాడు. ఏ పనీ చెయ్యాలనిపించలేదు. విసుగ్గా ఉంది. కాసేపు ఆలోచించి రాధకి ఫోన్ చేసింది.

"తప్పకుండా రండి నేను ఇంట్లోనే ఉన్నాను. మిసెస్ మూర్తి కూడా వచ్చారు. అందరం సరదాగా కబుర్లు చెప్పుకుందాం" అంది రాధ.

ఫోన్ పెట్టేసి "మీనా" అంటూ పిలిచింది శారద. "హా! మేమ్ సాబ్" అంటూ పరుగున వచ్చేసింది మీనా. తాను ఫలాన వారింటికి వెళ్తున్నట్లు చెప్పింది. "ఓ గంటాగి వస్తాను" అంది. "అలాగే మేమ్‌సాబ్" అంటూ ఇల్లంతా తాళాలు వెయ్యడం ముగించింది మీనా. శారద చీర కట్టుకుని తయారై వచ్చేసరికి వరండాలో సిద్ధంగా ఉంది మీనా పెద్దకూతురు మైత్రి. అమ్మగారు ఇవతలికి రాగానే మెయిన్ డోర్ లాక్ చేసి తాళాలు శారదకి అందించింది మీనా. గేటుదాకా వచ్చి సాగనంపింది. "జాగ్రత్తగా వెళ్ళు అమ్మగారితో" అంటూ కూతుర్ని హెచ్చరించింది.

శారదకి నవ్వు వచ్చింది. తాను ఒంటరిగా వెళ్తోంది కాబట్టి ఈ పిల్లని తోడు పంపిస్తోంది. ఎప్పుడూ అంతే. పదేళ్ళ మైత్రితో కబుర్లు చెప్తూ పది నిమిషాల్లో గమ్యం చేరింది శారద. వాకిట్లో పనిచేస్తున్న పనివాడు పరుగున వెళ్ళాడు. వెంటనే ఎదురొచ్చింది రాధ. "రండి" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించింది. "నువ్వెళ్ళు" అని మైత్రిని పంపించి లోపలికి వెళ్ళింది శారద. మిసెస్ మూర్తి ఆదరంగా పలకరించింది.

ముగ్గురూ కబుర్లలో మునిగిపోయారు. టీ తాగారు. మళ్ళీ కబుర్లు. వెళ్తాను అన్నా వెళ్ళనివ్వలేదు రాధ. బలవంతాన కూర్చోబెట్టేసింది. పూర్తిగా చీకటి పడిపోయింది. వీధి దీపాలు వెలిగాయి. హఠాత్తుగా పొగ, పిడకలు, రాక్షసిబొగ్గు వేసి అంటించిన పొయ్యి లోంచి పొగ, మేఘంలా ఇంట్లో జొరబడిపోయి ఇల్లంతా చుట్టేసింది. ఉక్కిరిబిక్కిరి అయిపోయారు ముగ్గురూ.

"అబ్బ వెధవ పొగ పొద్దునా, సాయంత్రం ఇదో తలనొప్పి" విసుక్కుంది రాధ.

"తలనెప్పి అని మెల్లగా అంటారా సరిగ్గా దీపాలు పెట్టే వేళ వీళ్ళు పొగ పెట్టే వేళ. ఈ పొగకి దోమలు చస్తాయి అంటారు మా వారు. దోమలు దుక్కల్లా తిరుగుతూనే ఉన్నాయి. మనకు చావొస్తోంది. ప్రతి ఇంట్లోనూ ఇదే మేళం" అంది మిసెస్ మూర్తి.

"మరి, మా ఇంట్లో ఎప్పుడూ ఇలా పొగ రాదండీ" అంది శారద.

వింతగా చూసింది మిసెస్ మూర్తి. మీ ఔట్‌హౌస్ వాళ్ళకు గాస్ కనెక్షన్ ఉందేమో" ఎగతాళి చేసింది.

"గ్యాస్ అయితే లేదుగానీ, ఇలా ఇల్లంతా చుట్టేసేలా పొగమాత్రం రాదు" చెప్పింది శారద.

"మీ పనిమనిషి చేతుల్లో పొగ రాకుండా వంట చెయ్యగల శక్తి ఉంది కాబోలు" అంది రాధ నవ్వుతూ. తానూ నవ్వేసి మాట మార్చేసింది శారద. కాసేపు కూర్చుని "ఇక వెళ్తాను" అని లేచింది. సాగనంపారు ఇద్దరూ.

గేటు దాటి కాస్తదూరం వెళ్ళేసరికి తాళాలు మరిచిపోయినట్లు గమనించింది శారద. వెంటనే వెనుతిరిగి వాళ్ళింటి వైపు నడిచింది. రాధ, మిసెస్ మూర్తి గేటు దగ్గర నుంచి ఇంట్లోకి వెళ్తూ పెద్దగానే మాట్లాడుకుంటున్నారు.

"ఏం బడాయి బాబూ! ఏదో చీరల గురించి, నగల గురించి గొప్పలు చెప్తే వింటాంగానీ, మా ఇంట్లో పొయ్యి లోంచి పొగ రాదు, మా పంపుల్లోంచి పాలు వస్తాయి అని చెప్తే ఏం నమ్ముతాం" అంటూ తన గురించే చెప్పుకుంటున్నారు.

అక్కడే ఆగిపోయింది శారద. వాళ్ళు లోపలికి వెళ్ళేదాకా ఆగి, అప్పుడు గేటు దగ్గరికి వెళ్ళి "రాధగారూ" అంటూ కేక పెట్టింది. పరుగెట్టుకు వచ్చింది రాధ. విషయం తెలుసుకుని "అరె! నేనూ చూడలేదు" అంటూ లోపలికి వెళ్ళి తాళాల గుత్తి తీసుకొచ్చి అందించింది. "వస్తాను" అని చెప్పి వెనుతిరిగింది శారద. వాళ్ళ మాటలు చెవుల్లో రింగుమంటున్నాయి.

"శారదకి బడాయి ఎక్కువ. నోరు తెరిస్తే గొప్పలు చెప్తుంది" అనే వ్యాఖ్యానం వినడం శారదకి కొత్తకాదు. చిన్నతనం నుంచీ అలవాటే. నిజానికి గొప్పలు చెప్పడం తనకి ఇష్టం లేదు. శారద మామూలుగానే మాట్లాడుతుంది. వినేవారికి అవి గొప్పలుగా అనిపిస్తాయి.

మరీ చిన్నతనంలో 'నీకు బడాయి ఎక్కువ' అని తోటి పిల్లలు మొహాన అంటే ఉక్రోషం పట్టలేక దెబ్బలాడేది. పెద్దయ్యాక ఎవరూ మొహాన అనరు, చాటున నవ్వుకుంటారు. కాబట్టి తనకు తెలియదు. ఇలా ఎప్పుడైనా చెవినపడితే తాను మాట్లాడిన మాటల్లో బడాయి ఎక్కడ ఉందా అని ఆత్మపరిశీలన చేసుకుంటుంది. అర్థం కాకపోతే అడిగి తెలుసుకుంటుంది.

చిన్నతనంలో ఒకసారి శారదతో చదువుతున్న ఒక అమ్మాయి మాటల సందర్భంలో "నిన్న మా ఇంటికి హఠాత్తుగా మా రెండో బావగారు వచ్చారు. మా అమ్మ చాలా కంగారు పడిపోయింది. ఆయనకి ఏం పెట్టాలో తెలియక అవస్థ పడుతుంటే నేను స్కూలు నుంచి వెళ్ళాను. నన్ను చూసి ప్రాణం లేచివచ్చినట్లు అయింది అమ్మకి. నేను స్వరాజ్యం పిన్నివాళ్ళింటికి వెళ్ళి గ్లాసెడు రవ్వ అప్పుతీసుకువచ్చాను. అమ్మ ఉప్మాచేసి బావగారికి పెట్టింది" అంటూ సమయానికి తల్లికి తానుచేసిన సహాయం సంతోషంగా చెప్పింది. అందరూ మెచ్చుకున్నారు.

అంత కంగారు పడడం ఎందుకో అర్థం కాలేదు తనకు. ఆ అమ్మాయినే అడిగేసింది. "ఎందుకంత కంగారూ? చిటికెలో మినపసున్ని కలిపేసి, జీడిపప్పు వేయించేసి పెడితే సరిపోతుంది కదా!" అంది.

ఆ అమ్మాయి మొహం ఎర్రగా చేసుకుని ఏడ్చినంత పని చేసి శారదతో బాగా దెబ్బలాడింది. మిగిలినవాళ్ళు కూడా తనదే తప్పని నిర్ణయించారు. ఏం తప్పు మాట్లాడిందో అర్థం కాలేదు శారదకి. వాళ్ళింట్లో హఠాత్తుగా అతిథులు వస్తే మినపుసున్ని, జీడిపప్పు పెడతారు. అవమానంతో ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చిన మనుమరాలిని బుజ్జగించి విషయం తెలుసుకుంది శారద నాన్నమ్మ. "పిచ్చితల్లీ" అంటూ బుగ్గలు నిమిరింది. "మినపసున్ని ఖరీదైన పదార్థం. బోలెడంత నెయ్యి కావాలి. మనలాంటి వాళ్ళకు ఫర్వాలేదుగానీ, మామూలు వాళ్లకు చీటికీ మాటికీ మినపసున్ని చేసుకోవడం సాధ్యం కాదు. మనకు బోలెడంత పాడి ఉంది. నెయ్యి సమస్య లేదు. కాబట్టి ఎవరైనా రాగానే డబ్బాలోంచి సున్నితీసి, బెల్లం తరిగి నెయ్యిపోసి కలిపేస్తాం.

అలాగే జీడిపప్పు, తాతగారి లాగా అందరికీ జీడిమామిడి తోటలు ఉండవుగదా! ఏదో కొంచెం కొనుక్కుని ఏ పరమాన్నంలోనో అపురూపంగా వాడుకుంటారు. గ్లాసెడు రవ్వకోసం అప్పు పరుగెత్తవలసిన ఇంట్లోని అమ్మాయిని పట్టుకుని మినపసున్ని జీడిపప్పు పెట్టలేకపోయావా అని నువ్వు అడిగేసరికి తన పేదరికాన్ని ఎత్తి చూపి ఎగతాళి చేస్తున్నావని బాధ పడింది" అంటూ వివరించి చెప్పింది.

నిజం తెలుసుకుని బాధపడింది శారద. అప్పటి నుంచి అదొక అలవాటు అయిపోయింది. ఎవరైనా తనను బడాయిలు పోతున్నావని విమర్శించగానే ఆ మాట పట్టుకుని ఇంటికొచ్చి అది ఎలా బడాయి అయిందో అడిగి తెలుసుకోవడం సాధారణం అయిపోయింది. చిన్నతనంలో నాన్నమ్మ, తాతగార్ల నుంచి, ఆ తర్వాత భర్త ద్వారా ఎన్నో సంగతులు అడిగి తెలుసుకుంది.

ఎంతో జాగ్రత్తగా మాట్లాడడం అలవాటు చేసుకుంది అయినా, ఏదో ఓ సందర్భంలో ఇలా మాట పడడం తప్పడం లేదు. ప్రస్తుతం తాను మాట్లాడిన మాటల్లో బడాయి, అతిశయోక్తి ఏం ఉందా అని ఆలోచిస్తూ ఇల్లు చేరింది శారద.

✧ ✧ ✧

బొమ్మల కొలువులా వరుసనదీరి ఉన్నాయి బంగళాలు. మూసపోసినట్లు ఒకే రీతిలో ఉన్నాయి. వెనుకగా ఔట్‌హౌస్‌లు, వాటిలోంచి పొగ లేచి బంగళా చుట్టూ వలయంగా ఏర్పడి ఉంది. తమ ఇల్లు మాత్రం స్ఫటికంలా ఉంది. తమ ఔట్‌హౌస్‌లో పొయ్యి వెలగడం లేదు. ఎదురువచ్చి తాళం అందుకున్న మీనాని అడిగింది. "నువ్వు పొయ్యి వెలిగించలేదా?"

అమ్మగారలా హఠాత్తుగా అడిగేసరికి తడబడిపోయింది మీనా. "పొద్దున చేసిన రొట్టెలున్నాయి" సమాధానం చెప్పింది. "సరే వెళ్ళు" అనేసింది శారద. మర్నాడు శ్రద్ధగా గమనించింది. ఆ పూట కూడా పొయ్యి వెలగలేదు. మీనాని అడిగితే, "పొయ్యి వెలిగించలేదు. సత్తూ తిన్నాం" అంది. ఆ సాయంత్రం కూడా సత్తూ తింటున్నాం అనే చెప్పింది.

తన మాటల్లో అతిశయోక్తి లేదని తనను హేళన చేసిన వారికి తెలియ చెప్పాలనిపించి రాధకు ఫోన్ చేసింది శారద. అంతా విని, "ఏదో ఒక పూట అయితే తినవచ్చు గానీ, రోజూ సత్తూ తింటున్నారా?" ఆశ్చర్యంగా, అపనమ్మకంగా అడిగింది రాధ, తికమకగా అనిపించింది శారదకి.

ఆ సాయంత్రం భర్తతో ఆ విషయం చర్చించింది. అంతా విన్నాడు. "ఈ ఊరిలో ఔట్‌హౌస్‌లలో ఉండే మనుషులలో మూడు రకాల వాళ్ళు ఉన్నారు. ఈ కార్ఖానాలో క్లాస్ ఫోర్ వర్గంలో పనిచేసేవాళ్ళు మొదటి రకం. వాళ్ళకి జీతాలు బాగానే ఉంటాయి. ఇంకా ఓవర్‌టైములు కూడా ఉంటాయి. బోనస్‌లు వస్తాయి. కావలసిన తిండి తిని, కోరిన బట్ట కట్టుకుని, సైకిలు, బ్లాక్ అండ్ వైట్ టీ.వీ, మంచాలు, కుర్చీలు వంటి సామాన్లు అమర్చుకుని లక్షణంగా జీవితం గడుపుతారు. పిల్లలని గవర్నమెంట్ స్కూళ్ళలో చదివిస్తారు. మగపిల్లలని మళ్ళీ ఈ కార్ఖానాలోనే చేర్పించడం తమ జీవిత ధ్యేయంగా పెట్టుకుని అనుక్షణం ఆ ప్రయత్నంలోనే ఉండి సమయం చూసుకుని ఉద్యోగంలో దూర్చేస్తారు. బ్యాండుపెట్టి, వీడియో తీసి ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేస్తారు. సుఖంగా జీవనం గడుపుతారు. ఇక రెండో రకం గవర్నమెంట్ ఉద్యోగం కాకపోయినా నెలకింత అని నికరాదాయం వచ్చే పని చేస్తూ బతుకుతారు. దుకాణాలలోను, సినిమాహాల్లోను, పెట్రోల్ బంకుల్లో, బస్సులలో క్లీనర్లుగా, హూటళ్ళలో పనిచేస్తూ ఉంటారు. వాళ్లకు తిండికీ, బట్టకీ లోటు ఉండదు కానీ, విలాసాలు చెయ్యలేరు. వీళ్ళు పిల్లలని చదివించరు. కాస్త జ్ఞానం రాగానే ఏదో ఒక పనిలో పెడతారు.

"ఇక మూడో రకం – రోజువారీ సంపాదన మీద ఆధారపడి బతికే వర్గం. రిక్షా తొక్కి, రోజూ కూలికి వెళ్ళి బతుకు గడుపుతారు. తుమ్మితే ఊడిపోయే ముక్కులా కూలిపని. వర్షాకాలం వస్తే పని ఉండదు. దినదిన గండంలా జీవితం గడపాలి. చిరిగిన బట్టలు కట్టుకుని, ఓ పూట తిని, మరోపూట తినక కాలక్షేపం చేస్తూ ఉంటారు. మన ఇంట్లో ఉండే మహేశుడు ఈ మూడవ రకానికి చెందినవాడు. కాబట్టి వాళ్ళు రోజూ సత్తూ తిన్నా అదీ తినకపోయినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు" అంటూ వివరంగా అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టు చెప్పాడు. భర్త టెన్నిస్ ఆడటానికి వెళ్ళగానే మీనాను పిలిచింది శారద. నిజం చెప్పమని నిలదీసి అడిగింది. భార్యను మేమ్‌సాబ్ పిలిపించి ఏదో మాట్లాడుతున్నారని గ్రహించిన మహేశుడు కూడా వచ్చాడు.

తల వంచుకుని నేలచూపులు చూస్తూ చెప్పుకు వచ్చింది మీనా. మహేశుడు ఒక లారీలో లేబర్‌గా పనిచేస్తాడు. ఆ లారీ బాగా ముసలిది అయిపోయింది. దాని మీద వచ్చే ఆదాయంలో మూడొంతులకు పైగా దాని రిపేర్లకే సరిపోయేది. అది అలా ఉండగా, ఒకరోజు లారీ డ్రైవరు బ్రేకులు పడక ఒక గేదెను గుద్దించేశాడు. గేదె చచ్చిపోయింది. గేదె యజమాని గుంపుని వెంటేసుకుని లారీ యజమాని మీదకు

దండెత్తి, బెదిరించి నష్టపరిహారం పుచ్చుకున్నాడు. విసిగిపోయిన లారీ యజమాని ఆ లారీని వచ్చిన ధరకు అమ్మేశాడు.

ఈ తతంగంతో మహేశుడి పని ఊడిపోయింది. మరో లారీ కొన్నాక పనిలోకి తీసుకుంటాను అన్నాడు ఆ యజమాని. కాళ్ళకి బలపాలు కట్టుకుని పని కోసం తిరుగుతున్నాడు మహేశుడు. ఎక్కడా దొరకడం లేదు. ఇంట్లో తిండిగింజలు అయిపోయాయి. దొరికినంత వరకు అప్పుచేసి తిన్నారు నాలుగు రోజులు. ఆ వైభోగం కూడా అయిపోయింది. గత వారం రోజులుగా మరీ కటకటగా ఉంది. ఇంచుమించు పస్తులుంటున్నారు. "మీరు ఇచ్చినది తిని కాలం గడుపుతున్నాం మేమ్‌సాబ్!" దీనంగా సమాధానం చెప్పింది మీనా.

కడుపులో దేవినట్లు అయింది శారదకి. మహేశుడు, మీనాలకు ముగ్గురు పిల్లలు. మైత్రి, ధాత్రి, గాయత్రి బుద్ధిగా, ముద్దుగా ఉంటారు. ఆఖరుది గాయత్రికి నాలుగేళ్ళుంటాయి. తన వెంట తిరుగుతూ, కబుర్లు చెప్తూ ఉంటుంది. గత రెండు మూడు రోజులుగా చీటికీ మాటికీ వచ్చి పంపు దగ్గర నీళ్ళు తాగుతూ ఉంటే "శీతాకాలం జలుబు చేస్తుంది, నీళ్ళతో ఆడకు" అని మందలించి పంపిస్తోంది. నీళ్ళతో ఆడడంకాదని, నీళ్ళు తాగి కడుపు నింపుకుంటోందని తనకేం తెలుసు! క్రితం రోజు పిల్లలు ముగ్గురూ టీవీ చూడడానికి వచ్చారు. అప్పుడు తాను జంతికలు తింటూ ఉంది. వాళ్ళని పిలిచి తలో ముక్కా పెట్టింది. వద్దు వద్దంటూ తీసుకున్నారు.

ఆకలి కడుపుతో ఉండి కూడా ఎదురుగా తినుబండారాలు కనబడుతూ ఉన్నా తల తిప్పి చూడని నిగ్రహం అంత చిన్న వయసులోనే ఆ పసిబిడ్డలకు అలవడిందనే సత్యం శారదని కలచివేసింది. ఉదయం పూట తమతోబాటు ఒక మనిషికి సరిపడా టిఫిను ఇస్తుంది. భోజనాల దగ్గర మిగిలిన ఆధరువులు ఫ్రిజ్‌లోపెట్టి అన్నం ఉంటే ఇస్తుంది. అయినా, ఇద్దరు మనుషులు ఉన్న ఇంట్లో ఏం మిగులుతుంది? ఎంత మిగులుతుంది? ఆ నాలుగు మెతుకులే అయిదుగురు తిని కాలక్షేపం చేస్తున్నారా?

ఎలా సాధ్యం? ఆకలితో ఉండడం ఎంత కష్టం? ఏ పూజరోజునో టిఫిన్ తినకుండా ఉండడమంటేనే నీరసం వచ్చి దేవుడు గుర్తొస్తాడు. మరి రోజుల తరబడి పస్తులుండడం ఎంత కష్టం? కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి శారదకి.

మహేశుడిని, మీనాని మందలించింది. "మా ఇంట్లో ఉంటున్నారు. మీ కష్టం, సుఖం నాతో చెప్పుకోక ఇంకెవరితో చెప్పుకుంటారు? అవసరం అయితే అడిగి తీసుకోవచ్చు కదా! పసివాళ్ళని పస్తు పడుకోబెట్టడం ఎందుకు?" అంటూ నిలదీసింది.

"మీరు మా తల్లిలాంటి వారు మేమ్‌సాబ్. మాకు ఇవ్వవలసింది అందరికంటే ఎక్కువగానే ఇస్తున్నారు. ఇంకా మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం ఎందుకని అడగలేదు" దీనంగా చెప్పింది మీనా.

"మరేం ఫర్వాలేదు. నీకో పది రూపాయలు ఎక్కువ ఇచ్చినంత మాత్రాన నాకు లోటు రాదు, నీకేం కావాలో అడిగి తీసుకో. రెండు పూటలా ఏదో ఒకటి వండుకుని తినండి. అంతేగానీ, నిండు ఇంట్లో పసివాళ్లను పస్తులుంచకు" ఖచ్చితంగా చెప్పింది.

"మేమ్‌సాబ్!" అంటూ చేతులు నులుముకున్నాడు మహేశుడు. "ఈ పూట తింటే రేపటికి పరగడుపు ఎన్నాళ్ళని యాచించడం? అయ్యగారు, మీరు దయతలచి ఏదైనా పని ఇప్పిస్తే మీ పేరు చెప్పుకుని జీవితాంతం మీకు సేవ చేస్తూ గడుపుతాం" అన్నాడు.

"అలాగే అయ్యగారితో చెప్తాను" హామీ ఇచ్చింది శారద. వెంటనే లేచి శేరు బియ్యం, పావుశేరు కందిపప్పు, నాలుగు బంగాళా దుంపలు తెచ్చి మీనాకు ఇచ్చింది. "ఖచ్చితంగా చెప్తున్నాను ప్రతిపూట వచ్చి ఏం వండుతున్నావో నాకు చెప్పి వెళ్ళాలి. మీరేం తింటున్నారో ఎలా ఉంటున్నారో నాకు తెలియాలి. ఏదీ లేకపోతే ఇంత గంజి కాచుకుని తాగండి. ఆకలి కడుపులతో మాత్రం ఉండొద్దు" అని ఖచ్చితంగా చెప్పింది.

తల ఊపి వెళ్ళిపోయారు ఆ దంపతులు. వెంటనే అరక్షణం ఆలస్యం చెయ్యకుండా చితుకులు పోగేసి పొయ్యి వెలిగించింది మీనా. పిల్లలు మహేశుడు చుట్టూ చేరారు. ఉడికీ ఉడకగానే ఊదుకుంటూ తినేశారు. ఈ హడావిడి చూస్తూనే ఉంది శారద. ఎంతో తృప్తి, ఆనందం కలిగాయి.

'మానవ సేవే మాధవ సేవ' అనుకుని ఆనందపడింది. పరోపకారార్థమిదమ్ శరీరమ్ అనుకుని తృప్తి పడింది భర్త రాగానే జరిగింది అంతా వివరంగా చెప్పింది. "మీరు ఎలాగైనా ప్రయత్నించి మహేషుడికి ఉద్యోగం ఇప్పిస్తే, వాళ్ళ బతుకు వాళ్ళు బతుకుతారు" అంది. "అలాగే చూద్దాం" అన్నాడతను.

✧ ✧ ✧

నెల రోజులు తిరిగి వచ్చాయి. మంచం మీద పడుకుని నవల చదువుకుంటున్న శారద మెత్తని అడుగుల చప్పుడు వినిపించడంతో తలెత్తింది. ఎదురుగా మీనా, తల్లి

కొంగు పట్టుకుని గాయత్రి, తలకాయ బాదుకోవాలనిపించింది శారదకి. "ఏం కావాలి?" అడిగింది కించిత్తు విసుగ్గానే.

"ఈ పూటకి ఏమీ లేవు మేమ్‌సాబ్!" తల వంచుకుని సమాధానం చెప్పింది మీనా. ఉసూరుమనిపించింది శారదకి. "పద" అంటూ లేచి లోపలికెళ్ళి అర్ధశేరు గోధుమపిండి, నాలుగు ఉల్లిపాయలు ఇచ్చింది. మళ్ళీ వచ్చి మంచం మీద కూర్చుని తల చేత్తో పట్టుకుంది.

మీనా, మహేశులను మందలించి, వాళ్ళకు ఆనందంగా దానం చేసిన శారదకు నాలుగు రోజులు తిరిగి వచ్చేసరికి ఆ ఆనందం, తృప్తి మూలపడి దాని స్థానాన చిరాకు, విసుగు చోటు చేసుకోసాగాయి. యాచించడానికి వస్తున్న మీనాను చూస్తే చెంప వాయిద్దాం అనిపిస్తోంది. నిజానికి వాళ్ళ తప్పు ఏమీ లేదు. వాళ్లని పీకి పాకాన పెట్టి వేదిక ఎక్కిన రాజకీయ నాయకునిలా ఎడా పెడా వాగ్దానాలు చేసింది తానే. తీరా కార్యరూపంలో పెట్టాలంటే కష్టంగా ఉంది.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. అప్పనంగా వస్తోంది కదా అని మీనా ఎక్కువ ఏమీ అడగడం లేదు. మహేశుడు తిండికి జరిగిపోతోంది కదా అని బద్ధకించకుండా ప్రతిరోజూ పనికోసం వెతుకుతూనే ఉన్నాడు. కూలి దొరికితే ఆ డబ్బులతో రెండ్రోజులు సర్దుకుంటున్నారు.

లేనినాడు శారదని అడుగుతూనే ఉన్నారు. వాళ్ళకు ఆ మాత్రం సహాయం చేసినంత మాత్రాన శారద ఐశ్వర్యం తరిగిపోదు. ఆ మాటకొస్తే వాళ్ళ కుటుంబాన్ని జీవితాంతం పోషించగలిగిన ఆర్థిక స్తోమత ఉంది శారదకి.

కానీ, ఇక్కడ ప్రసక్తి శారద ఐశ్వర్యం గురించి కాదు, మీనా అర్హత గురించి. యాచన ఎప్పుడూ యాచకుని అర్హతని బట్టి నిర్ణయింపబడుతుంది గానీ, దాత సంపదని బట్టి కాదు. కోటీశ్వరుని ఇంటికైనా ముష్టివాడువెళ్తే పది పైసలో, పావలానో వాడి బొచ్చెలో పడేస్తారు తప్ప, తన దగ్గర బోలెడుంది కదా అని కొత్త పదిరూపాయల కట్ట ధానం చెయ్యరు.

పోనీ 'ఏదో మాట వరసకి అన్నాను. నేనుమాత్రం ఎంతకని ఇవ్వను. మీ చావు మీరు చావండి' అని ఖచ్చితంగా చెప్పేద్దామంటే ఆఫ్ట్రాల్ ఓ పనిమనిషి ముందు ఓటమి అంగీకరించడానికి అహం అడ్డు వస్తోంది. ఓ వారం రోజులపాటు తాను

సాయం చేస్తే మహేశుడికి ఉద్యోగం దొరికిపోతుంది. అంత పెద్ద కార్ఖానాలో ఇంత పెద్ద ఆఫీసరైన తన భర్త ఆ మాత్రం చెయ్యలేక పోతాడా అనుకుంది.

✧ ✧ ✧

కానీ, అదంత తేలిక కాదని తెలిసింది. భర్త చెవిలో పోరగా పోరగా, ఇదుగో అంటూ వాయిదాలు వేసి చివరకు ఒకరోజు సీరియస్‌గా విచారించాడు. గత నాలుగేళ్ళుగా అప్రెంటీస్ ట్రైనింగ్ పూర్తిచేసుకుని ఉన్న వాళ్ళనే తీసుకునే అవకాశం కనుచూపు మేరలో లేదని తేలింది.

పోనీ, ఏ కాంట్రాక్టరు దగ్గరైనా రోజుకూలీగా పని దొరుకుతుందేమో అడిగి చూడమని భర్త వెంట పడింది. అక్కడా చుక్కెదురే అయింది. అలా నేరుగా పని ఇచ్చే అవకాశం కంట్రాక్టరుకి లేదుట. దానికి ఒక యూనియన్ ఉందిట. అందులో పేరు నమోదు చేయించుకుని దానికి ఇంత అని డబ్బు కడితే, వరుస ప్రకారం పిలిచి పనులు ఇస్తారుట. "ఆ యూనియన్‌లో జేరు. ఆ డబ్బేదో నేను కడతాను" అని చెప్పి పంపించింది. మొహం వేలాడేసుకుని వచ్చాడు మహేశుడు. ఇప్పటికే నాలుగు వందల మందికి పైగా ఉన్నారట లిస్టులో. అందులో సగం మందికైనా పని దొరికితేగాని కొత్తవాళ్ళని చేర్చుకోము" అన్నారట వాళ్ళు హతాశురాలు అయిపోయింది శారద. నిస్సహాయస్థితి అంటే ఏమిటో తెలిసింది. కనిపించిన ప్రతివారితో తన సమస్య చెప్పుకుని సహాయం చెయ్యమని అర్థించింది, బతిమలాడింది, భంగపడింది.

చివరకు శారదని చూసి భయపడిపోయే స్థితికి వచ్చారు జనాలు. ఫోన్ చేస్తే ఇంట్లో ఉండి లేరని చెప్పించడం, స్వయంగా వెళ్ళి కలుద్దామంటే ఏదో సాకు చెప్పి తప్పించుకోవడం చెయ్యసాగారు.

అలా రోజు వెంట రోజు భారంగా గడుస్తున్నాయి. మహేశుడు ప్రతిరోజూ పనికోసం వెళ్తున్నాడు. లేని పూట మీనా దీనంగా వచ్చి అమ్మగారి ఎదుట నిలబడుతూనే ఉంది. విసుగు చెందని విక్రమార్కునిలా ప్రయత్నిస్తూనే ఉంది శారద. రోజులు, వారాలు, నెలలు అయ్యాయి. అందరూ నిరాశ నిస్పృహలతో కాలం గడుపుతున్నారు.

హఠాత్తుగా వెలుగురేఖ కనిపించింది. విసుగు చెందకుండా శారద చేసిన ప్రయత్నాలకు ఫలితం కనిపించింది. ఆ ఊళ్ళోని కాన్వెంటు స్కూలు ప్రిన్సిపాల్ మహేశుడికి ఉద్యోగం ఇచ్చింది. నెలకి అయిదు వందలు జీతం.

ఆనందంతో తలమునకలైపోయాడు మహేశుడు. నెలకింత అని నికర ఆదాయం వచ్చే ఉద్యోగం. పైపెచ్చు స్కూల్లో పని కాబట్టి, సెలవురోజుల్లో కూలి పనికి కూడా వెళ్ళవచ్చు. నాలుగు రాళ్ళు వెనకేసుకుని పిల్ల పెళ్ళి చెయ్యాలి అనుకుంటూ ఏవేవో ఊహలలో తేలిపోయాడు. శారద ఆనందం వర్ణనాతీతం. లాటరీలో లక్షలు వచ్చినంతగా ఆనందించింది. మీనా అయితే ఆనందం పట్టలేక అమ్మగారి కాళ్ళమీద పడి ఏడ్చేసింది.

ఎండాకాలం, సాయంత్రం ఏడు గంటలు అయినా ఇంకా చీకటి పడలేదు. భరించలేనంత వేడి. ఎయిర్ కండిషన్ గదిలో నుంచి బయటికి వచ్చింది శారద. హాయిగా చన్నీళ్ళు స్నానం చేసి మెత్తని ఇస్త్రీ చీర కట్టుకుంది. దేవుని గదిలోకి వెళ్ళి దీపం వెలిగించింది. సాంబ్రాణి కడ్డీలు వెలిగించింది. వాటి పొగ సువాసనలు వెదజల్లుతూ గాలిలోకి లేచింది. అంతలోనే బయట నుంచి పొగ ఇంట్లో ప్రవేశించింది. పిడకలు, రాక్షసిబొగ్గు కలిసిన పొగ ఉక్కిరి బిక్కిరి చేస్తూ ఇల్లంతా చుట్టుముట్టేసింది. గుండెనిండా పొగ పీల్చుకుని హాయిగా నిట్టూర్చింది శారద.

*ఇండియా టుడే- 21 అక్టోబర్, 5 నవంబర్ 1996*